# పార్వతీ - మాఁవయ్యా

"అమ్మా! ఏమే? పండుక్కి కొత్త పరికిణీ కుట్టిస్తావా? లేదా?" రాగాలు తీస్తో తల్లిని అడిగింది పార్వతి.

కొయ్య పెట్టెలో దాచిన ముంతను బయటకుతీసి, అందులోని చిల్లర డబ్బులు అరిచేతులో పోసుకొని లెక్క చూసుకొంటున్న చుక్కమ్మ కూతురువంక తిరిగి - "అప్పుడే ఏం తొందరొచ్చిందే? పండగ యింకా చాలా రోజు లుంధిగా?" అన్నది.

"ఊఁ! ఇంకా ఎప్పుడేం? పండగ దగ్గర కొస్తుంటేను? బోడికి వాళ్ళమ్మ అప్పుడే కుట్టిస్తుంటేను?" గుణిగింది పార్వతి.

"నీకూ కుట్టిస్తా లేవే-పిచ్చి పిల్లా! ఏడవమాకు; పండగ నాటికి మీ కోటయ్య మామయ్యకూడా వస్తాడుగా? వస్తూ నీకు బోలెడన్ని పరికిణీ గుడ్డలూ, రవి గ్గుడ్డలూ తెస్తాడే!"

"ఊఁ, పోవే? నువ్వెప్పుడూ అట్లాగే చెప్తావు? కోటయ్య మావయ్యవన్నీ అబద్ధాలే. మొన్న పండక్కూ పోగులు కొని పెట్తానని పెట్టాడూ? అసలు మావయ్యకు

నేనంటే ఇష్టమే లేదు! పరికిణీ గుడ్డలూ లేదు! ఏమీ లేదు, కావాలంటే చూడు ?" బుంగమూతి పెట్టి అన్నది పార్వతి.

“ఒసి పిచ్చి కట్టే ఊరుకోవే? మావయ్యకు నువ్వంటే పంచ ప్రాణాలే. కోరిన బట్టలు తెస్తాడు! పండగ నాడు అదెమ్మ కూతురు తలమీద కొట్టినట్లు దాని కంటే మంచి పరికిణీ, రవికా కట్టుకొని తిరుగుదువుగాని.” అంటూ చుక్కమ్మ చిల్లర డబ్బులు ముంతలో పోసి, ముంత కొయ్యపెట్టె అడుగున పాత గుడ్డల చాటున దాచింది.

“ఊఁ చెప్పావ్ లే; బోడితో వంతు పెడుతూ దానికి వాళ్ళమ్మ పరికిణీ గుడ్డ కొని మిసినీ సాయిబుకు కట్టటానిక్కూడా ఇస్తేను! బోడి నన్ను మిసినీ సాయిబు దగ్గరకు తీసుకుపోయి చూపిస్తేను! అమ్మోయ్! ఎంత బావుందనుకున్నావ్ ? ఎఱ్ఱ పూలూ, ఇంత పెద్ద నల్లం చూసు!” కళ్లు మెరిపిస్తో అన్నది పార్వతి.

“సరే; నీకూ అట్లాంటిదే కుట్టిస్తాలే! ముందు కరెంటు ఫ్యాక్టరీకి పోయి ఒక బుట్టెడు పొట్టుతీసుకొచ్చి ఆ పిడకలు నాలుగూ చెయ్యి! నిన్నటినుంచి ఆ కుప్పంతా ఎండిపోతూంది.” అని కూతురుకు పని పురమాయించింది చుక్కమ్మ.

కూతురు వాలకం చుక్కమ్మకు బాగా తెలుసు. దానికి ఏదో పని చెప్పకుండా వదిలేస్తే పొద్దస్తమానమూ

ఆ ఎర్రపూల పరికిణీకోసం మారాం చేస్తే తనచుట్టూ తిరుగుతుందని! పార్వతి ఏ గొడవలో పడ్తే యిక అదే గొడవ! ఆటల్లో పడితే పనే మరిచిపోతుంది. చీటికి, మాటికి అవి కావాలీ, ఇవి కావాలీ అని తల్లిని వేధించదు. కాని ఒకసారి దానికి దేనిమీదైనా మనసు పడితే దాన్ని సాధించుకునేదాకా మంకుపట్టు పడుతుంది.

చుక్కమ్మది బతికిచెడ్డ కుటుంబం. చుక్కమ్మ కాపరాని కొచ్చిన రోజుల్లో- అత్తగారింట్లో అష్ట ఐశ్వర్యాలూ అనుభవించిందని చెప్పటానికి వీల్లేకపోయినా, కూటికీ, గుడ్డకూ లోటు లేకుండానే గడిచిపోయింది. రానురాను చుక్కమ్మ సంసారం చితికిపోయింది. పిత్రార్జితమంతా కర్పూరంలా హరించుకు పోవడం; చుక్కమ్మ భర్త రామయ్య మంచాన పడటం వొకసారే జరిగాయి. తమ ఆ స్థితికి కారణం రామయ్య అసమర్థత అని చుక్కమ్మ అంటే "కాలం కలిసిరాలేదని" రామయ్య అనేవాడు. ఏమైతే నేం, రామయ్య చనిపోయిన రోజున దీపారాధనకు కూడా చుక్కమ్మ చేతిలో దమ్మిడీ లేకుండా పోయింది!

అప్పటికి పార్వతికి ఏడేళ్లు; రామయ్య పోతూ వదిలిపెట్టి పోయింది, యిప్పుడు చుక్కమ్మ వుంటూన్న ఆ నిట్టాడి ఇల్లు మాత్రమే!

మొగుడు చనిపోయాక, యీ ఆరు సంవత్సరాల నుంచీ చుక్కమ్మ రెక్కల కష్టంమీదే కూతుర్ని పెట్టుకొని బతుకుతూంది.

పిడకలు చేసి అమ్ముకోవడం, వడ్లదంపూ, మధ్యాహ్నం, తీరిక సమయాల్లో రాట్నంతిప్పి నూలు అమ్ముకోడంలాంటి పనుల్లో చుక్కమ్మ అహర్నిశలూ నిమగ్నమయి వుండేది. వాటిమీద వచ్చే ఆదాయంతో పొట్ట నింపుకుంటూ అణా బేడా వెనకేస్తూ వుండేది.

పార్వతి కాస్త చేతికి అక్కరకొచ్చాక చుక్కమ్మకు కొంచెం వెసులుబాటుగా వుంది. తల్లి వడ్ల దంపుళ్ళకు పోయి సాయంకాలానికి తిరిగొచ్చే సరికి పార్వతి వో సోలెడు గింజలు వుడకేసి వుంచేది. పొద్దుటపూట పార్వతి అలా బీట్లోకి వెళ్ళి పుల్లా పొలుసూ ఏరుకొస్తూంటే, పొయ్యిలోకి కొనకుండా కాలం జరిగిపోతూంది.

చుక్కమ్మ కూతురుమీద కొండంత ఆశ పెట్టుకొని కాలం దొర్లిస్తోంది. ఇప్పుడో రేపో అన్నట్టుగా పార్వతి ఎదిగి వస్తోంది. పిల్ల పెద్దదయాక కోటాయికిచ్చి మూడు ముళ్ళూ వేస్తే వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతారు. కోటాయ్ కూడ వొల్లు కుదురి ఇంట్లి పట్టున వుండి కూలీనాలీ చేసుకొని పెళ్ళాన్ని పోషించుకుంటాడు. తల్లినీ, తండ్రినీ చిన్నప్పుడే పోగొట్టుకొన్న పసివాణ్ణి దగ్గరకుతీసి సాకినందుకు, వాణ్ని వొక ఇంటివాణ్ని చేసినట్టవుతుంది. అంతకంటే తనకేంకావాలి? కాని కోటాయి రాను రాను మరీ "రాలుగాయి" అయిపోతున్నాడు! ఎట్లాగో ఏమిటో వాణ్ని దోవలో పెట్టడం?

పొయ్యిమీద వెసట్లో బియ్యం వేసి, పొయ్యిముందు కూర్చొని కట్టెలు యెగదోస్తూ, కోటాయి గురించీ, కూతురు పార్వతి భవిష్యత్తును గురించీ ఆలోచిస్తోంది చుక్కమ్మ.

కోటాయికి చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు. వాడి నాయనమ్మే వాడిని పెంచి పెద్దవాణ్ని చేసింది. చుక్కమ్మ ఇంటిపక్క ఇల్లు కావడంతో ముసలమ్మకు, దూరపు బంధుత్వంతోపాటు చుక్కమ్మతో మంచి దోస్తీ ఏర్పడింది. ముసలమ్మ పెంపు పేరుకే కాని కోటాయి దాదాపు చుక్కమ్మ ఇంట్లోనే పెరిగాడు. పార్వతీ, వాడూ వొక ఇంట్లో పిల్లల్లా కలిసి మెలిసి పెరిగారు. తల్లీ తండ్రీ లేనివాడని ముసలమ్మ కోటాయిని చాలా గారాబంగా పెంచింది. ముసలమ్మ తాలూకు డబ్బు కర్చయినకొద్దీ వాడిలో అల్లరి బుద్ధులు పెరిగినయ్! ముసలమ్మ కళ్లుకప్పి, ఆమూలా, యీ మూలా ముసల్ది జాగ్రత్త చేసిన డబ్బులు కాజేసుకెళ్ళి జల్సా చేస్తుండేవాడు. వాడిచుట్టూ కుర్రాళ్లు వొక మూక వుండేవాళ్లు. వాడి ముఠాలో అప్పుడప్పుడూ, బస్సుస్టాండ్స సినిమా హాలువద్దా జేబులుకొట్టే రకంకూడా చేరడం కద్దు!

కోటాయి పదిహేనేళ్ళకే ఒక పిల్ల రౌడీలా తయారయాడు. కోటాయికి పదిహేనో పడు వచ్చేసరికే వాడి నాయనమ్మ కాలప్రవాహంలో గుటుక్కుమంది!

అప్పటికే ముసలమ్మ బాగా వయసులో వుండగా రెక్కల కష్టంమీద సంపాదించిన డబ్బంతా కోటాయి బీడిపిక్కలకు, సరిపోయింది.

కోటిగాడి నాయనమ్మ చావబోయే ముందు చుక్కమ్మచేత చేతిలో చెయ్యి వేయించుకొంది.

"కోటాయికి పార్వతినిచ్చి పెళ్ళిచేస్తానసే" మాట చుక్కమ్మదగ్గర్నుండి తీసుకొన్న తర్వాత ముసలమ్మ ప్రాణం విడిచింది.

నాయనమ్మ చావు కోటాయిలో కొంత మార్పు తీసుకరాక పోలేదు. అప్పట్నుంచీ వ్యక్తిత్వం, సర్వ స్వాతంత్ర్యాలు వచ్చినవానిలా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. దానివల్ల వాడిక్కలిగిన మంచికంటే చెడే ఎక్కువేమో!

అప్పట్నించి కోటాయి చుక్కమ్మ ఇంట్లోనే ఉండి తిని తిరుగుతుండేవాడు.

రెండు సంవత్సరాలు గడిచి పోయినై.

చుక్కమ్మ కోటాయిని వొకదారికితీసుకొచ్చిందనే చెప్పాలి.

చుక్కమ్మ ప్రయత్నంమీద కోటాయిని ఒక సోడా కొట్లో పని కుదిర్చింది. రెండు నెలలు పనిచేసి అక్కడ మానేసి సినిమాహాల్లో పాటల పుస్తకా లమ్మటానికి కుది రాడు. కాని కొద్దిరోజులకే పుస్తకా లమ్మిన డబ్బులు

హోటలు వాళ్ళకు సరిగ్గా యివ్వకపోవడంచేత అక్కడినుంచి ఆ పనికి స్వస్తి జరిగింది! తర్వాత సైకిల్ షాపులో పనికి కుదిరి కొంతకాలం బుద్ధి కుదిరి బాగానే పని చేశాడు. ఒకరోజు యజమాని లేని సమయం చూసి పది రూపా యిలదాకా జేబులోవేసుకొని ఎక్కడికో అంతులేకుండా పోయాడు. ఆ పోయిన పోవడం పదిహేను రోజులదాకా పత్తా దొరక లేదు. వాడు చేసినపనికి చుక్కమ్మకు కోపం వచ్చినా, వాడు కళ్ళముందు కనపడకుండా పోయేసరికి, ఏమైపోయాడో ఏమో పాపం అని చుక్కమ్మ మనసు తహతహలాడిపోయింది.

"మావయ్యా ఎప్పుడొస్తాడే?" అని తల్లిని మాటి మాటికి అడుగుతూ పార్వతి బెంగపెట్టుకుంది.

కోటాయి తిరిగొచ్చాక చుక్కమ్మ నయానా, భయానా ఎంతో హితబోధ చేసింది! ఇకనుంచీ ఇలాంటి చెడ్డపనులు చేస్తే ఇంటికి రానివ్వననీ, పార్వతిని ఇవ్వననీ బెదిరించింది.

కోటాయి ఒట్టేసుకొని "ఇకనుంచి బుద్ధికుదిరి ఏదో పని చేసుకొంటూ, ఇంటిపట్టున ఉంటాను" అని చెప్పాడు. కోటాయి సత్ప్రవర్తనమీద చుక్కమ్మకు నమ్మకం. కుది రినా ఊళ్ళోవాళ్ళకు నమ్మకం తగలలేదు. వాడ్ని నమ్మి ఎవరూ పనిలో పెట్టుకో లేదు.

ఉన్నకొద్దీ ఏదో వొకపని సంపాదించి బతకాలనే దీక్ష కోటాయిలో బలపడి పోయింది. కుటుంబం గడవక

చక్కమ్మ పడుతున్న అవస్థలు కోటాయి మనస్సులో పట్టుదలను కలిగించాయి.

ఒక రోజు గుంటూరునుంచి లారీ వచ్చి కోటాయి మామూలుగా కూర్చునే హోటలు ముందు ఆగింది. కోటాయికి పరిచయమున్న వొకడు ఆ లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. అతన్ని కోటాయి గుంటూరులో ఏదైనా పని ఇప్పించమని అడిగాడు.

అందుకు డ్రైవర్—"నువు చేసే పనులు గుంటూరులో ఏమున్నాయికానీ, మా లారీలో క్లీనర్ పని ఖాళీగావుంది. నువ్వు చేస్తానంటే మా ఓనర్‌కు చెప్పి ఇప్పిస్తాను!" అన్నాడు.

"ఐతే జీతమెంత ?" అనిఅడిగాడు కోటాయి ఆశగా.

"పదిహేను! ఇంకా ట్రిప్పుల్నిబట్టి బేటాఇస్తారు!" అన్నాడు డ్రైవర్.

"సరే! ఇప్పుడే వస్తాను. మీ ఓనరుగారితో చెప్పి కుదుర్చు!" అని కోటాయి లారీ ఎక్కి కూర్చున్నాడు.

మూడోరోజున తిరిగొచ్చి కోటాయి చక్కమ్మతో తనకు దొరికిన క్లీనర్ ఉద్యోగాన్ని గురించి చెప్పాడు.

"ఏదైతేనేం ? బుద్ధి కుదిరి చేసుకుంటే?" అని తన సంతోషాన్ని వెలిబుచ్చింది చక్కమ్మ.

"ఇదిగో! చక్కమ్మక్కాయ్! ఇట్టా క్లీనరుగా ఆరు నెల్లుండి మెల్లిగా డ్రైవింగ్ నేర్చుకుంటే డ్రైవరుకూడా

అయిపోవచ్చు! డ్రైవరైతే ఇబ్బడి కిబ్బడి జీతం! బత్తా కూడా దొరుకుద్దే చుక్కమ్మక్కాయ్" కోటాయి కళ్ళల్లో ఆశలు తళుక్కుమన్నాయి.

"ఎందుక్కా కూడదురా-మనసుండి చేసుకుంటేను. మా వూళ్ళో రామయ్యగారబ్బాయి అదేదో దేశంపోయి అమరా యీమరా తిప్పటం నేర్చుకొని ఇప్పుడు రైలు ఇంజన్ డ్రైవరై పోలేదంటారా?" అన్నది చుక్కమ్మ!

అందాకా గడ్డంకింద చేయిపెట్టుకొని వింటూ కూర్చొన్న పార్వతి —

"అమ్మోయ్! మావయ్య రైలింజన్ డ్రైవరైతె నేను గార్డు అవుతానేవ్?" అంటూ కిలకిలా నవ్వింది.

"ఒసేయ్! బోడీ! తంతానేవ్! అంటూ కోటాయి పార్వతి చెవి పట్టుకో పోయాడు.

"అమ్మా! చూడవే? యీ కోతిముఖమాడు!" అంటూ పార్వతి తల్లి చాటున చేరింది.

"ఉండరా కోటాయ్? నువ్వు డ్రైవరుపని నేర్చుకొన్నాక పెళ్ళిచేసుకొని దాని పొగరు అణుద్దువుగాని!" అని మురిపంగా అన్నది చుక్కమ్మ కూతురు తల నిమురుతూ.

"పోవే! ఆ పేడతట్టముఖమాణ్ని నేనసలు చేసుకోను! ఊ!" రాగాలు తీస్తూ ఇంట్లోకి పరిగెత్తింది పార్వతి.

కోటాయి అన్నంతిని లారీయెక్కి వెళ్ళిపోయాడు —కోటాయి వెళ్ళి మూడు రోజులైంది. ఇంతవరకూ రాలేదు. ఏమైపోయాడో ఏమో ?

పొయ్యిముందుకూర్చొని ఆలోచిస్తోంది చుక్కమ్మ పొయ్యిమీద అన్నం తుకతుక లాడుతోంది. చుక్కమ్మ హృదయం కోటాయికోసం తహతహ లాడుతూంది !

"కుఱ్రసన్నాసి ! ఎంత కష్టంపడుతున్నాడో ఏమో! అసలు లారీ పని మానేసి ఎక్కడైనా పోలేదు గదా? ఏమో అకతాయి ! ఎందుకైనా తెగిస్తాడు. సుబ్బరంగా ఊళ్లోనే ఏదైన పని కుదిరిస్తే నయం. కళ్లముందు పడి వుంటాడు. తన తెలివి మండ ! వాణ్ణి అసలు లారీమీద పని చేస్తానంటె ఎందుకొప్పుకుంది ? వాణ్ని ఇష్టమొచ్చి నట్లు అలా ఊళ్ళమీద తిరగనిస్తే ఇంకెందుకైనా పనికి వస్తాడా ?

అంతలోకే " సుక్కమ్మకొక్కాయ్ ! సుక్కమ్మ కొక్కాయ్ ! " అంటూ తడికి తోసుకొని లోపలికి వచ్చాడు కోటాయి.

గంజి వార్చి అన్నపు తపేళా కింద పెడుతూన్న చుక్కమ్మ " వచ్చావురా నాయనా ! రా !! " అని అప్యాయంగా అన్నది.

అన్నపు తపేళానుంచి శగ మూత సందులగుండా బయటికి చిమ్మింది ! తెడ్డుతో అన్నం కదిపి పొయ్యిమీద

పెడుతూ చుక్కమ్మ కోటాయిని చూసి "నీళ్ళు పోసుకోరా ? అన్నం తిందువుకాని," అన్నది.

"పార్వతిపది ?" ఇల్లు కలయజూస్తూ, చేతిలోవున్న పూస మిఠాయిపొట్లం కింద పెడుతూఅన్నాడు కోటాయి.

"ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్ళింది ఊక తీసుకు రావటానికి! చాలా సేపయింది! ఈపాటికివస్తోండాలి! ముందు నువ్వు కానియ్ ! బువ్వడికింది. పచ్చడి నూరుకొస్తాను. అంటూ చుక్కమ్మ పచ్చిమిరపకాయలూ, యింతవుప్పూ చింతపండూ ఒక గిన్నెలో వేసుకొని రోటిదగ్గరకు వెళ్ళింది.

కోటాయి తలకు కట్టుకున్న రుమాలుతీసి దండెం మీదివేసి, వంటినున్న ఖాకి చొక్కా విడచి బ్లూనిక్కరుతో నించున్నాడు. స్నానం చేయడానికి తుండుగుడ్డ భుజాన వేసుకొని.

వాడి నల్లటి శరీరంమీద మురికి చారులు చారలుగా కనిపిస్తోంది. శరీరంమీద అంతగా కండలు పెరగక పోయినా పుష్టిగల మనిషి అవుతాడనే చెప్పాలి. కోటాయికి పదిహేడు వెళ్ళి పద్దెనిమిదో సంవత్సరం వచ్చింది. యవ్వనంలో కాలు పెడుతున్నాడు. మిసమిసలాడే శరీరం. విహంగాల్లా ఎగిరే భావాల తీవ్రత, కోటాయి నిశితమైన చూపుల్లో తొణికిసలాడుతోంది. విశాలమైన నుదురూ, ఎత్తైన ముక్కూ, వుంగరాలు తిరిగి పొదలా

వాడి నల్లటి జుట్టూ. మనిషి నలుపైనా ఎంతో ఆకర్షణ గలిగిస్తూ వుంటాయి.

కోటాయి స్నానం చేసి వచ్చేసరికి చుక్కమ్మ పచ్చడి నూరుకు వచ్చింది.

"పార్వతి యింకా రాలేదేమే అక్కాయ్!" వళ్ళు తుడుచుకుంటూ అన్నాడు కోటాయి.

"ఏమోరాం? చాలా సేపయింది. అది ఎక్కడికి పోతే అక్కడేరాం? అన్నట్టు మళ్ళీ సాయిబు దగ్గరకు పోయి కూర్చుందేమోరాం!" అంటూ చుక్కమ్మ తడికె తోసి బయటకు తొంగిచూసింది."

"అడుగోరా! కోటాయ్! పార్వతి వస్తోంది." అన్నది చుక్కమ్మ,

పార్వతి ఊకబుట్ట భుజాన పెట్టుకొని వయ్యారంగా నడిచి వస్తూంది.

గుబురు జుట్టులోకి దువ్వెన పోనిచ్చి దువ్వుకొంటున్న కోటాయి బయటికి చూశాడు.

అల్లంత దూరాన మావయ్యను చూసిన పార్వతికి సంతోషమూ, సిగ్గూ పొంగి వచ్చాయి. పార్వతికి చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. విశాలమైన పార్వతి కళ్ళు మెరిశాయి. భుజానఉన్న బుట్టలోని వరిపొట్టు ఝల్లున కిందకు రాలి తెల్ల పరికిణీమీదపడి నక్షత్రాల్లా మెసిరింది. పార్వతి

ముంగురుల్లో బంగారువన్నె వరిపొట్టు యిరుక్కొని ఎండ లో ముత్యాల్లా మెరుస్తోంది.

పార్వతికి పదమూడో ఏడు వచ్చింది. వికసించ బోయే మొగ్గలా పార్వతి శరీరం కాంతులు ప్రసరిస్తోంది. ఏపుగా పెరిగి వస్తున్న పార్వతీసౌందర్యం రోజురోజుకూ కోటాయిని ఆకర్షిస్తోంది.

నల్లంచు తెల్లని పరికిణీమీద, అక్కడక్కడా అతు కులు వేసి కుట్టిన చిలకవన్నె పావడా, తెల్లపూల గులాబీ రంగు రవికా తొడుక్కొని, చిలిపి చూపులు చూస్తూ, లేడిలా గెంతుకుంటూ వచ్చి, వరిపొట్టు బుట్ట కింద దించి లోపలకు వచ్చింది పార్వతి.

"ఒహో మామయ్యగారెప్పుడో దిగారే?" అని పరామర్శించింది పార్వతి. పరికిణీ గుడ్డ తెచ్చాడేమో అన్న ఆశతో పార్వతి ఇల్లంతా వెదకి—

"తెస్తాడంటివే? ఎక్కడమ్మా?" అమ్మవంక చూసి ఏడుపుముఖం వేసి అన్నది పార్వతి.

"తెస్తాడు లే వే? ఈసారి గుంటూరు వెళ్ళినప్పుడు. పండగ ఇంకా వారం రోజులుందిగా?" అని సముదా యించింది చుక్కమ్మ.

"ఎందుకూ బోడి అలుగుతోంది" అన్నాడు

"ఓసే! పార్వతీ! అన్నట్టు మావయ్య మిఠాయి తెచ్చాడే! మిఠాయి! పూస మిఠాయంటే నీకు బాగా ఇష్టం గదూ?" అన్నది చుక్కమ్మ.

"నాకు మిఠాయి వద్దూ గిఠాయి వద్దు! అదంతా ఆడి నెత్తినే కొట్టుకోమను." అని మూతి ముడుచుకొంది పార్వతి.

ఒసేయ్ పిల్లా! ఏమిటే నీ ఏడుపూ! వాడింటి కొచ్చాడో లేదో మొదలుపెట్టావే? అసలు నీకు వాడి పొడే గిట్టకుండా వచ్చిందేమో?" అన్నది. చుక్కమ్మ కొద్దిగా కోపం తెచ్చుకొని.

"ఏవిటక్కోయ్! ఇంతకీ దానిక్కావలసింది?". అన్నాడు కోటాయి.

"పరికిణీ గుడ్డ కావాలట! పరికిణీగుడ్డ ఆదెమ్మ కూతురు కొనుక్కొన్నదట! అట్లాంటిదే కావాలట! నిమ్మళంగా కుట్టిస్తాలేవే అంటే మాట వినిపించుకోకుండా మూడు రోజుల్నుంచీ అవజాన పోరుకేసి కూచుంది! చూడరా?" అన్నది చుక్కమ్మ.

"ఎంత అవుతుందేమిటే?" అన్నాడు కోటాయి. "ఎంతకాకేమిరా! ఏడుంబావులా అవుతుందట! ఇప్పుడికిప్పుడు ఎక్కడ తెచ్చికొంటామే అంటే వినుపించుకోదే!" అన్నది చుక్కమ్మ.

"అబ్బో, ఈ బోడి ముఖానికి ఏడుంబావలా పరికిణీ కూడానా?" పార్వతిముఖంలోకి నవ్వుతూఅన్నాడు కోటాయి.

"ఏయ్! మంగలం మొకమోడోయ్. నవ్వబాక య్యోయ్! అందం కారిపోతుంది! నిన్నెవ్వడూ తెచ్చి పెట్టమన్లేదులే." అన్నది రోషంగా పార్వతి.

"అబ్బోవ్! యీబోడి ఏడు రూపాయిల పరికిణీ కట్టుకొని సినిమా స్టారు అయిపోద్ది కావాలే చుక్కమ్మ క్కాయ్" అన్నాడు కోటాయి వెకిలిగా నవ్వుతూ.

ఆ మాటలకు పార్వతి ఉడుక్కు పోయింది. రోషం ఏడుపులోకి దిగింది.

"ఊ! పోండి! నాకు పరికిణీ వద్దు; ఏమీ వద్దు! పండగనాడు నేను పాత పరికిణీ కట్టుకుంటాన్లె. అసలు నాకేమి వద్దు! పోండి!" అంటూ పార్వతి వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

"ఊరుకోవే పిచ్చి పిల్లా! మావయ్య ఎగతాళి కన్నాడు లేవే?" అన్నది చుక్కమ్మ చిరునవ్వునవ్వుతూ.

"ఊరుకో బోడీ! గమ్మత్తుకంటే ఏడుస్తావేం? తప్పకుండా కొనితెస్తాను ఊరుకో!" అంటూ కోటాయి వెళ్ళి పార్వతి చేతులు పట్టుకొని బతిమిలాడాడు.

పార్వతి రబ్బరు బొమ్మలాగా మావయ్య చేతుల్లోనుంచి జారి ముడుచుకొని కూచుంది.

"ఊరుకో పార్వతీ! నీకు పరికిణీ, పావడాకూడా తెస్తాగా! గుంటూర్లో బాగా కుట్టేవాల్లుంటారు! పరికిణీ అక్కడే కుట్టించి తెస్తాను! సరేనా?" మావయ్య పార్వతి గడ్డంపుచ్చుకొని బ్రతిమిలాడుతూ అన్నాడు.

పార్వతికి కొంత కోపం తగ్గినా ఇంకా పెట్టుగా బుంగమూతి పెట్టుకొని కూచుంది.

"సరే! వుండు నీ పని పట్టా!" అంటూ కోటాయి ఇంత పూస మిఠాయిగడ్డ తీసుకొచ్చి పార్వతి నోట్లో బలవంతంగా కుక్కాడు.

"చూడవే అమ్మా!" పార్వతి మధురంగా నవ్వింది.

"సరే! లెగండి! పొద్దెక్కింది! అన్నాలు తిందురుగాని!" అని లేచిపోయి చుక్కమ్మ రెండు కంచాల్లో అన్నం పెట్టింది.

పార్వతి మావయ్యసరసన కూర్చుని సంతోషంగా అన్నం తినడం పూర్తయేలోపల నాలుగుసార్లయినా పార్వతిని ఉడికించి ఏడిపించి మళ్ళీ నవ్వించి వుంటాడు కోటయ్య.

కోటయ్య అన్నం తిని గుంటూరు వెళ్ళడానికి ప్రయాణమైనాడు.

తలకు రుమాలు కట్టుకొని, ఖాకీ చొక్కా బ్లూ నిక్కరూ తొడుక్కొని, 'అవారాలా' యీల వేసుకొంటూ బోజులో నడిచిపోతున్న కోటయ్య మావయ్యను చూస్తుంటే పార్వతి హృదయానికి చక్కిలిగింతలు పెట్టినట్టయింది. ఏవో తెలియని ఊహాలు పార్వతి మనసులో విరియపూచిన మల్లె పందిరిలా అల్లుకొన్నాయి.

పోతూన్న కోటయ్య మావను చూసి— "మావ య్యోయ్! పరికిణీ మర్చిపోకుండా తీసుకరావాలి!" అన్నది పార్వతి.

మావయ్య చిరునవ్వు చిందిస్తూ వెనక్కు తిరిగి పార్వతి కళ్ళల్లోకి చూశాడు.

"ఎర్రపూల నల్లంచు తెల్ల పావుడా? మావయ్యా" పార్వతి కంఠం కోకిలమ్మ గొంతులా పాడింది!

మావయ్య పెదవులపై హాసనరేఖలు అనంతంగా వెన్నెలలా ప్రసరించాయి!

"మావయ్యా! మావయ్యా! చిలకపచ్చ వోణీ మావయ్యా!"

"గులాబి వన్నె రవికా!" అన్నాడు కోటాయి.

"మావయ్యా ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీ, చిలుకపచ్చ వోణీ! గులాబివన్నె రవికా! అన్నీ తెస్తావా! మావయ్యా! అన్నీ తెస్తావా మావయ్యా!" ఆనందం పార్వతి కంఠంలో సెలఏరులా ప్రవహించింది!

"అన్నీ తెస్తానే! ఎర్రపూల నల్లంచు తెల్లపరికిణీ, చిలక పచ్చ వోణీ....గులాబి వన్నె రవికా అన్నీ తెస్తానే బోడీ!" వుత్సాహంగా అంటూ కోటాయి వీధి మలుపున రొదచేస్తూ నుంచోన్న లారీ ఎక్కి వెళ్ళిపోయాడు.

మావయ్య పోతూ "బోడీ" అన్న చివరిమాటకు పార్వతికి చిరుకోపం వచ్చినా, హృదయంలో పొంగి పొరలి వస్తున్న ఆనందపు అలల్లో కొట్టుకు పోయింది.

"మావయ్యంటే మావయ్యా! భలే మావయ్యా!" అనిచప్పట్లు కొట్టుకొంటూ ఇంట్లోకి పరుగెత్తిందిపార్వతి.

* * *

రేపు లేదు ఎల్లుండే పండుగ !

నాలుగు రోజులనాడు వెళ్ళిన మావయ్యా ఇంత వరకూ రాలేదు !

చీకటి పడింది ! ఐనా మావయ్యా రాలేదు. ఇంకె ప్పుడొస్తాడు మావయ్యా!

బజార్లో లారీ మోత ! మావయ్యా వస్తున్నా డేమో ?

దూరంగా రోడ్డు మీద హెడ్ లైట్లు కాంతి. కోటయ్యా మావయ్యా వస్తుండాలి !

పొద్దు పోయింది. జనం అంతా సద్దు మణిగారు ఇంకా రాలేదు మావయ్యా !

మావయ్యా రానే రాడా ?

అమ్మకూడా నిద్రపోయింది.

ఇంకేం వస్తాడు కోటయ్యా మావ ?

ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీ తన కెవరు తెస్తారు ?

చిలకపచ్చ వోణీ....?

తనకెవరు....?

గులాబి వన్నెగల రవిక....?

తనకు....?

పార్వతికి ఏడుపు వస్తోంది. దిండులో ముఖం పెట్టుకొని వలవలా ఏడ్చింది పార్వతి.

తను ఏడిస్తే ఎవరన్నా తెచ్చియిస్తారా !
తను ఏడిస్తే మావయ్యా వస్తాడా ?
ఛీ! తను ఏడువకూడదు. ఎందుకో మరి ఏడువ కూడదు.

పార్వతికి నరనరానా రోషం, కసీ పారుకాడింది.
" ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీ "
మావయ్యా అబద్ధాలకోరు !
" చిలకపచ్చ వోణీ .... "
వాడే బోడిగాడు! అన్నీ అబద్ధాలు.
"గులాబీ వన్నె రవికా....?

కోతిగాడు ! మంగలం మొఖమాడు ? అన్నీ అబద్ధాలు! వాడు తీసుకురాడని తనకు ముందే తెలుసు. వాడి మాటలు తను అసలే నమ్మలేదు. అమ్మేనమ్మింది. అదే నమ్మింది, ముందు దాన్ని తంతే వాడికిబుద్ధొస్తుంది.

తనకు ఎర్రపూల నల్లంచు పరికిణీ ? పార్వతికి దుఃఖం పొంగి వచ్చింది. పొరలి ఏడ్చింది, కుమిలి కుమిలి ఏడ్చింది.

రాత్రి నడిఝాము దాటింది.

దూరంగా యిలకోడి కూత సన్నగా వినిపిస్తోంది. పార్వతి మంచంలో పడుకొని కళ్ళు మూసుకొంది. చీకటి కళ్ళు తెరచి చూసింది. బయటంతా చీకటిగావుంది.

పార్వతికి పాపం కళ్ళు మూసినా అంతాచీకటిగా వుంది.

ఆ చీకట్లో, ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీ-కోటి గాడు-ఇంకా ఇంకా వందలకొద్దీ వేలకొద్దీ పరికిణీలు, వోణీలూ, కోటయ్య మామలూ మెలకునలోంచి నిద్ర లోకి, నిద్రలోంచి పీడకలలోకి పార్వతి జారిపోయింది.

తెల్లంగా తెల్లవారింది. సూర్యుడు కరకరా ఎక్కి వస్తున్నాడు! పార్వతి నిద్రమంచం మీది నుంచి లేచి కూచుంది.

ఐనా కోటయ్య మావయ్య రాలేదు.

"ఇంకా ఏం కూచుంటావ్? లేచి ముఖం కడు క్కో" అన్నది తల్లి పార్వతిదగ్గరకొచ్చి.

"అమ్మా! కోటయ్య మావయ్య రాలేదేమే?"

"అన్నం వేళకు వస్తాడేమో లేవే!".

"వస్తాడా!" ఆకలు మనసులో పీడించుతూండగా పార్వతి కళ్ళు నులుపుకుంటూ లేచిపోయి ముఖం కడు క్కుంది.

"అన్నం వేళ అయింది!" అయినా మావయ్య రావలేదు! అదే రాలేదు! అదే చచ్చాడేమో చస్తే చచ్చాడు! చస్తే మరీ బాగుంటుంది. వాడుచస్తే నేను ఏడవనే ఏడవను. అసలు నాకు ఏడుపే రాదుగా!"

కాని పార్వతికి ఏడుపొచ్చేసింది.

"అదేమిటే! పిచ్చిపిల్లలా అన్నంముందు కూచొని ఏడుస్తావు?" అన్నది చుక్కమ్మ.

పార్వతికి అన్నం సహించలేదు ! "నాకు అన్నం వద్దు!" అని పల్లెంలో నీళ్ళుపోసి లేచి వెళ్ళింది పార్వతి.

"ఏడవబాకే? సాయంకాలానికి ఎట్లాగట్లా వొక పరికిణీ గుడ్డ కొనిస్తాను ? " అన్నది చుక్కమ్మ.

"సాయంకాలనికి చింపిస్తే మిసినీసాయబు ఎప్పుడు కుట్టిస్తాడేం ?" దీర్ఘం తీస్తూ అన్నది పార్వతి.

" రేపు మధ్యాహ్నానికి కుట్టిస్తాడులే ! సాయం కాలము గుడి దగ్గరకు పోయేప్పుడేగా అందరూ కొత్త బట్టలు కట్టుకోనేది ?" అని చుక్కమ్మ కూతురుకు నచ్చ చెప్పిపోయి కొయ్యిపెట్టె తెరచి మూత బయటికి తీసి, చిల్లర అరచేతిలో పోసుకొని లెక్కచూసింది. లెక్క చూసుకొని....

"పావలా తక్కువ అరు ! " అనుకొంది.

ఐదుంపావులాకు పరికిణి గుడ్డ, మిగతా అర్థ రూపాయికి, ఏదోవకటి చవకరకం, రవిక గుడ్డా వస్తవి. పోతే వోణి ఏదోవొక పాతదివేసుకుంటే ఎల్లమారిపోదా అనుకొన్నది. చుక్కమ్మ.

దిగాలుపడి ఇంట్లో కూచున్న పార్వతి దగ్గరిక ఆదెమ్మకూతురూ, ఇంకా నలుగురు స్నేహితురాండ్రు పార్వతి ఈడువాళ్లే గుంపుగా వచ్చి పడ్డారు.

" మీ మావయ్యా పరికిణీ, వోణీ తెచ్చాడా ? ఏదీ చూపించవోయ్ ? " అన్నది. ఆదెమ్మ కూతురు.

"మా మావయ్య ఇంకా రాలేదు !" అన్నది చిన్నపుచ్చుకొని పార్వతి.

కోటయ్య చెప్పి వెళ్ళిందగ్గర్నుంచీ పార్వతి తన స్నేహితురాండ్రతో మహా గొప్పగా చిత్ర విచిత్రంగా వర్ణించి చెప్పింది ఇంతవరకూను. ఇప్పుడు వాళ్ళొచ్చి చూపించమనే సరికి పార్వతికి ప్రాణం అలిసి పోయింది.

స్నేహితుల్తో కలిసి ఇంటింటికి పోయి వాళ్ళు కుట్టించుకొన్న పరికిణీలూ, చొక్కాలూ చూసి వచ్చింది. ముఖ్యంగా అడెమ్మ కూతురు కట్టించుకొన్న ఎర్రపూల నల్లంచు పరికిణీ తాకిచూసి తనవంటిమీద పెట్టుకొని కళ్ళ నీళ్ళ పర్యంతం అయిపోయింది పార్వతి.

ఇంటికివస్తూ, దారిలో మిసినీ సాయబు దగ్గరకు వెళ్ళి మంచి మంచి గుడ్డపేలికలు-రిబ్బన్‌లకు బదులు జడకు కట్టుకోవడానికి తెచ్చుకొన్నది.

సూర్యుడు పడమటి దిక్కుకు తిరిగి వాలి పోతు న్నాడు. సాయంత్ర మౌతూంది.

"ఏమే? అమ్మా! ఇంకెప్పుడే?" అన్నది పార్వతి తల్లిని చూసి.

చుక్కమ్మ ముంతలోని చిల్లర కొంగున ముడివేసు కొని "సరేపద!" అని పార్వతిని వెంటబెట్టుకొని పెద్ద బజార్లో వున్న బట్టలదుకాణానికి బయలుదేరింది.

కోటాయి కోసం ఎదురుచూసి, ఎదురుచూసి ఆశలు అడియాసలు కాగా చుక్కమ్మ బయలు దేరింది.

కోటాయి వస్తూ పిల్లకు బట్టలు తెస్తే, డబ్బులు తెల్లారి పండుగ ఖర్చుకు వుంటాయి కదా అని ఇంతవరకు అనుకుంది చుక్కమ్మ. కూతురు పరికిణీ గుడ్డకోసం పడుతూన్న ఆరాటం చుక్కమ్మ హృదయంలో వొకవైపు బల్లెంలా గుచ్చుకొంటున్నా, కోటాయి వస్తాడనే ఆశతో ఎదురుచూసింది. అన్నిమాటలూ చెప్పి కోటాయి రాకపోయేసరికి చుక్కమ్మ మనసులో వాడిమీద కోపం, అసహ్యం కూడా కలిగాయి.

కూతురుకు పండుగ కయినా అనువైన గుడ్డలు కుట్టించలేకపోయానే అన్న కడుపుకోతా, తల్లీ తండ్రీ లేని కుర్ర సన్యాసి పండుగపూట కూడా కళ్ళముందు లేకుండా పోయాడే, ఏమైపోయాడో అన్న హృదయావేదనా చుక్కమ్మను వేధిస్తున్నాయి.

నడుస్తూన్నంతసేపూ పార్వతికి మావయ్యా మీద కోపం అంచలు అంచలుగా వచ్చి పడుతోంది. మావయ్యను గురించి మనస్సులో ఏమేమో అనుకుంటూ బట్టల దుఖాణం దగ్గిరికి తల్లితోపాటు వచ్చింది.

చీరల దుఖాణం ముందుకురాగానే పార్వతి హృదయం ఎగిరి గంతులు వేసింది. బీరువాలో పరికిణీగుడ్డలు కనబడుతూంటే పార్వతి మనసు ఆనందంతో పరవళ్ళు పరవళ్ళు తొక్కింది.

చుక్కమ్మ బట్టల దుఖాణంలో కాలు పెట్టబోతుండగా వెనుకనుంచి "చుక్కమ్మా!" అని ఎవరో పిలిచారు.

చుక్కమ్మ వెనక్కు తిరిగి చూసేసరికి ఆదెమ్మ ఇంకో మగ మనిషి రొప్పుకొంటూ, రోజుకొంటూ పరుగెత్తుకుంటూ వచ్చారు.

"ఇంకేముందే చుక్కమ్మా! కొంప ఆరిపోయిందే! మీ కోటాయి లారీమీదనుంచి పడ్డాడంట. ప్రమాదంగా వుందట. ఇదిగో ఈ మనిషి వచ్చాడు గుంటూరునించి" అని గాబరాగా చెప్పింది ఆదెమ్మ.

చుక్కమ్మ కొన్ని క్షణాలపాటు స్థంభించిపోయింది!

పార్వతి మొఖం వెలవెలపోయింది.!

దానిలేత హృదయం ఏం బాధపడిందో?

గుంటూరునుంచి లారీ వోనరు పంపించిన మనిషి జరిగిన సంగతి వివరంగా చెప్పాడు.

ఉదయం లారీ బియ్యపు బస్తాలు వేసుకొని గుంటూరునుండి వస్తోంటే, ఒక చెట్టుకు గుద్దుకొని రోడ్డు పక్కన గుంటలో బోల్తా కొట్టింది! లారీ బాడీలో బస్తాల మీద కూర్చున్న కోటాయికీ, ముందుసీటులోవున్న డ్రైవరుకూ ఇంకొకరికీ తీవ్రంగా గాయాలు తగిలాయనీ, ముగ్గుర్నీ గుంటూరు ఆస్పత్రిలో చేర్పించారనీ, కోటాయి పరిస్థితి మరీ ప్రమాదంగా వుందనీ చెప్పాడు.

ఉన్నపాటున చుక్కమ్మ ఆదెమ్మను తోడు తీసుకొని పార్వతితో గుంటూరు బస్సు ఎక్కి వెళ్ళింది.

దోవలో బస్సులో కూర్చుని చుక్కమ్మ కోటయ్య ను తలచుకొని ఏడ్చింది. తల్లి ఏడుస్తుంటే పార్వతికీ ఏడు పొచ్చింది.

పార్వతి ఎందుకేడ్చిందో ఆ దేముడికూ్కడా తెలియదేమో ? కొనుక్కోబోతున్న పరికిణీ కొనకుండా ఆగిపోయింది. మావయ్య లారీ మీదనుంచి కింద పడ్డాడు. అయితే చచ్చిపోతాడా ? పాడు మావయ్య తనకు ఎఱ్ఱ పూల పరికిణి లేకుండా చేశాడు. ఛీ! మావయ్య ఎప్పుడూ ఇంతే !

ఎఱ్ఱపూల పరికిణీ, కోటయ్య మావయ్య, అమ్మా అందరూ కలిసి పార్వతిని ఏడిపిస్తున్నారు. పార్వతి హృదయం క్షోభించిపోయింది. లోలోపలే ఎందుకో మరెందుకో అర్థాలు లేకుండానే ఏడ్చింది. తెలిసీతెలియని వయస్సూ, అమాయకపుటాలోచనలూ, పార్వతి మన స్సులో అల్లిబిల్లిగా తిరిగాయి. మధ్య మావయ్యమీదకసి.

తన్ను అన్యాయం చేస్తే మాత్రం ఏదో వొకటి జరుగదూ ? మంచి పని జరిగిందిలే! అయ్యతిక్క కుది రిందిలే.

పార్వతి చూస్తూండగనే చుక్కమ్మ కొంగుమూట విప్పి బస్సువాడికి డబ్బులు యిచ్చింది. తన ఎఱ్ఱపూల నల్లంచు పరికిణీ డబ్బు - బస్సువాడు జేబులో వేసుకు న్నాడు! వాడి జేబువైపు కసిగా చూసింది పార్వతి. ఎందుకో పార్వతికి ఊరికనే ఏడుపొస్తోంది.

బస్సు గుంటూరు చేరింది. చుక్కమ్మా ఆదెమ్మా పార్వతి ఆస్పత్రికి వెళ్ళి కోటాయి వున్న వార్డులోకి వెళ్ళారు.

కోటయ్య బెడ్ మీద స్పృహ తప్పి పడివున్నాడు. గాయాలు మోపుగా తగిలాయి. ఖాకీ చొక్కా, నీలం రంగు లాగూ రక్తంతో తడిచి ముద్దయి వున్నాయి. తలకూ, మోచేతులకూ, కాళ్ళకూ కట్టుకట్టి వున్నాయి. రక్త హీనమయి పాలిపోయిన కోటాయి ముఖం మీద తుడిచేసిన రక్తపు చారికలు ఇంకా కనపడుతోన్నాయి.

చుక్కమ్మ కోటాయి మీదపడి గొల్లున ఏడ్చింది. మావయ్యనుచూసి పార్వతి ఏడ్చింది. డాక్టరూ నర్సులూ; చుట్టూ చేరారు. ఆదెమ్మ పార్వతిని ఊరుకో పెట్టడానికి ప్రయత్నించింది.

ఒక అరగంటకు కోటయ్య నీరసంగా కదిలి, మూలిగి కళ్ళు తెరిచాడు.

పార్వతి ఆదుర్దగా మావయ్య కళ్ళల్లోకి చూసింది. కోటయ్య బెడ్ పక్కనున్న నర్సుకు సంజ్ఞ చేశాడు, కట్టు కట్టివున్న చేయి మెల్లిగా కదిలిస్తూ.

నర్సు కాగితం చుట్టివున్న పార్సిల్ బాగా నలిగి పోయివుంది. తీసుకొచ్చి కోటయ్య కిచ్చింది. కోటాయి మెల్లిగా అందుకోని....

" ఇదిగో! బోడీ! " అంటూ పార్వతి చేతుల్లో పెట్టాడు. రక్తసిక్తమైన కోటాయి పెదవులమీద చిరునగవు నీరసంగా తోణికింది.

పార్వతి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. ఆ కళ్ళల్లో హాస్పిటల్ ఎలక్ట్రిక్ లైట్ల కాంతులు ప్రతిఫలించి మెరిశాయి!

కోటాయి బాధగా మూలిగి కళ్ళు మూసుకొన్నాడు. మావయ్యకేదో చెపుదామనుకొంది పార్వతి. కాని మావయ్య అప్పటికే కళ్లు మూసుకొన్నాడు.

డాక్టరు వచ్చి కోటాయి నాడి చూసి, "రక్తం పూర్తిగా పోయింది. రాత్రికూడా రక్తం ఇవ్వండి." అని నర్సుతో చెప్పాడు.

మంచంచుట్టూ వున్న వాళ్లను బయటికిపంపించింది నర్సు.

డాక్టరు చుక్కమ్మతో చెప్పాడు.

"కేసు ప్రమాదంగానే వుంది. సాయంకాలం వరకు గడిస్తే ఫరవాలేదు. ఎవరైనా ఒకళ్లు బెడ్ దగ్గిర వుండండి."

చుక్కమ్మ పార్వతిని ఆదెమ్మతో వూరుకు పంపించి తను మాత్రం వున్నది గుంటూర్లో కోటాయిని అంటి పెట్టుకొని.

ఆదెమ్మ పార్వతి బస్సు ఎక్కి ఇంటికి వచ్చారు. ఇల్లు చేరేసరికి రాత్రి పదిగంట లయింది. అంతవరకూ చేతులో బట్టల పొట్లాం పట్టుకొని మౌనంగా వుంది. పార్వతి. పార్వతిని ఆదెమ్మ తనఇంటికి తీసుకొని పోయింది.

ఆ రాత్రి పార్వతి అన్నం సరిగా తినలేదు. రాత్రి సరిగా నిద్రపోలేదు.

తెల్లవారింది ! పండగ వచ్చేసింది !!

దిగులుగా వోమూల కూచున్న పార్వతికి ఆదెమ్మ తలంటిపోసింది.

మధ్యాహ్నం బూరెలు తింటూంటే పార్వతికి మావయ్య తలపుకు వచ్చాడు. తనకు ఆదెమ్మ ఇచ్చిన నాలుగు సజ్జ బూరెల్లో రెండు దాచి పొట్లాం కట్టి వుంచింది. మావయ్య సయమై తొందరగా వస్తాడు ! మావయ్య నోట్లో రహస్యంగా ఎవరూ చూడకుండా బలవంతంగా సజ్జ బూరెలు కుక్కుతుంది ! మరీ మావయ్య ఆరోజు పూస మిఠాయి తన నోట్లో —అబ్బో ! అల్లరి మావయ్య ! భలే మామయ్యేనే ?

సాయంకాలమైంది. పెద్దవాళ్ళంతా శివాలయం దగ్గరకు పంచాంగం వినడానికి వెళుతున్నారు. పిల్లలు సింగారించుకొని కోలాహాలంగా శివాలయం ముందు ఆడుకొంటున్నారు.

ఆదెమ్మ పెట్టెలో దాచిన గుడ్డల పొత్తి తీసి పార్వతికి ఇచ్చింది. పొట్లాం విప్పిచూసుకొన్నది పార్వతి.

ఎర్రపూల నల్లంచు జరీ అంచు తెల్ల పరికిణీ, చిలక పచ్చ సిలుకు వోణీ, గులాబీ వన్నె పట్టు రవికా ?

పార్వతి మనస్సు పవిత్ర లోకంలో విచ్చలవిడిగా తిరిగింది.

"మీ మామయ్య భలే గుడ్డలు తెచ్చాడే ?"

ఆశ్చర్యంగా అన్నది ఆదెమ్మ కూతురు.

"మరి మామయ్యంటే ఏమిటి అనుకున్నావ్ ?" అన్నది. పార్వతి పరికిణీ కట్టుకుంటూ తెల్ల పరికిణీ కుచ్చిళ్ళ దగ్గర ఎర్ర పూవుల్లో కలిసిపోతూ అరచేతి వెడల్పున ఎర్రటి రక్తపుడాగు వుంది.

పరికిణీమీద ఆ నెత్తుటి మరక కనిపించకుండా పార్వతి చిలకపచ్చ సిలుకు వోణీ వేసుకుంది.

ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీమీద చిలకపచ్చ సిలుకు వోణీ వేసుకొని, గులాబి వన్నె పట్టురవిక తొడుక్కొని పార్వతి, నొసట దమ్మిడీ వెడల్పున కుంకంబొట్టు పెట్టుకొని సింగారించుకొని స్నేహితురాండ్రితో కలిసి శివాలయానికి వెళ్ళింది.

శివాలయం మండపంలో కూర్చుని పురోహితుడు పంచాంగం చదువుచున్నాడు. ఆడవాళ్ళూ, రైతులూ, ఊళ్ళో జనం అంతా కొత్త సంవత్సరం తమకు మోసుకు వచ్చిన శిరిసంపదలను గురించి వింటూ కూర్చున్నారు.

ఆడపిల్లలూ, మొగ పిల్లలూ, ఏయీడుకాయీడు వాళ్ళు గుడిముందు గుంపులు గుంపులుగా చేరి కోలాహలంగా మాట్లాడుకుంటూ ఆడుకుంటున్నారు.

పార్వతి కొత్త బట్టలు కట్టుకున్నాగాని ముఖంలో ఆనందపు తెరలను తోసుకొని విషాదచ్ఛాయలు కనిపిస్తూ వున్నాయి. మనసులో ఏదో గుబులుగా వుంది. ఆ పిల్లల్లో కూచుంటే తనకు వంటిమీద చీమలు పారుకాడి నట్టుగా వుంది.

పార్వతి లేచి రఁయ్యిన ఇంటికి పరుగెత్తింది. దోవలో ఆదెమ్మ గుంటూరు వెళ్తూ ఎదురైంది.

"ఓసే పార్వతీ! మీ మావయ్యకు బలువుగా వుంది, రమ్మని మీ అమ్మ కబురుచేసింది. నువ్వూ మాఅమ్మాయి కలిసి ఇల్లు భద్రంగా చూసుకొంటూ వుండండి ! రేప్పొద్దున తిరిగి వస్తాను !" అని చెప్పి ఆదెమ్మ బస్సు ఎక్కి వెళ్ళిపోయింది.

పార్వతికి ఇంటికి వెళ్ళటానికి మనస్కరించడంలేదు. వేరుగా శివాలయం దగ్గరకు వెళ్ళింది. వెళ్ళిందేకాని మళ్ళీ పిల్లలలో కెల్లి ఆడుకోడానికి బుద్ధిపుట్ట లేదు.

నిర్మానుష్యంగా వున్న శివాలయం వెనక్కి వెళ్ళి గుడిగోడకానుకొని వంటరిగా కూర్చుంది పార్వతి.

సూర్యుడు పశ్చిమాన కొండల చాటుకు పోతున్నాడు. శివాలయం ఆవరణలో వున్న మారేడు చెట్లు చీకటి నీడలను విరజిమ్ముతున్నాయి.

ముసురుకుంటూన్న చీకటిలో నిర్జన ప్రదేశంలో వంటరిగా కూర్చుని పార్వతి ఆవురుమని ఏడ్చింది.

మావయ్య-కోటయ్య మావయ్య చచ్చిపోయాడా! లేదు ! మావయ్యకు నయమౌతుంది. బతికి ఇంటికివస్తాడు! మావయ్య నోట్లో తను సజ్జ బూరెలు పెట్టుతుంది! మావయ్యను తనుతిట్టింది ఎంతతప్పుపని చేసింది! మావయ్య చచ్చిపోయి - ఎక్కడికి పోతాడు? మావయ్యతో పాటు

తనూ చచ్చిపోతుంది ! చచ్చిపోయి మావయ్యా దగ్గరకు పోతుంది!

ఎంత మంచి పరికిణీ, వోణీ, రవికా తెచ్చాడు. ఎంత మంచి మావయ్యా ! మావయ్యా చచ్చిపోడు; నయమై ఇంటికి వస్తాడు.... వెక్కి వెక్కి ఏడ్చింది పార్వతి !

గుడిగోడకు ఆనుకొని చేతులు జోడించి దేముణ్ని ప్రార్థించింది. "మా మావయ్యకు నయం చేయి. నీకు వంద కొబ్బరికాయలు కొడ్తాను".

పార్వతి గుండె చెరువై పోయింది. అశ్రువులు చెక్కిళ్ళపై ప్రవాహంలా దొర్లింది.

"మావయ్యా, మావయ్యా" పార్వతి ముఖం ఎర్రపూలనల్లంచు కొత్త పరికిణీలో దూర్చి కుమిలికుమిలి ఏడ్చింది. పరికిణీపై హత్తుకుపోయిన మావయ్యా రక్తం పార్వతి నొసటి కుంకమతో హత్తుకుపోయింది.

పార్వతి రోదనం, తన మావయ్యని బ్రతికించమని చేసిన ప్రార్థనా, మొరా, గుళ్లో పదిలంగా కూర్చున్న ఆ పార్వతీ పరమేశ్వరులు విన్నారో లేదో !

కాని మెల్లగా దూరంగా వినిపిస్తోన్న పార్వతి రోదనధ్వని గుడిముందు కొత్త సంవత్సరం పంచాంగం పఠనం చేస్తో, నూతన ఉగాది తెచ్చిన సిరిసంపదలను ఎలుగెత్తి ఘోషిస్తూన్న పురోహితుని కంఠధ్వనిలో మునిగిపోయి శివాలయం ముందు కూచున్న జనంలో ఎవ్వరికీ పార్వతి ఏడుపు వినపడలేదు ! *